క్లుప్తంగా

మహా పడిపూజ



కాళేశ్వరం: 'దివ్య పదునెట్టంబడి మహా పడి పూజ' కార్యక్రమాన్ని కాళేశ్వరంలో సర్పంచ్ వెన్నపురెడ్డి వసంత-మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా గురువారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల గురుస్వామివారితో వైభవోపేతంగా పూజ తంతు చేపట్టారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారణ భక్తులు, గ్రామస్తులు తరలివచ్చారు. పూజా కార్యక్రమంలో పాల్గొని ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. స్వామి శరణం అయ్యప్ప శరణం అంటూ భక్తుల భజన కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులు స్వామివారి పూజలో పాల్గొని 'అరువన్నం' ప్రసాదాన్ని స్వీకరించారు.

మండల సభ వాయిదా

చిట్యాల: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన మండల సర్వ సభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ దావు వినోద పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం ఉండటం వలన కోరం సభ్యులు రాలేకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం అనంతరం మళ్లీ సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు.

నియామకం



కాటారం: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్సీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా కాటారం మండలం దామెరకుంటకు చెందిన ఆత్మకూరి స్వామియాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య, జిల్లా అధ్యక్షుడు కుమార్‌యాదవ్ గురువారం నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులతో పాటు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు స్వామియాదవ్ ఈ సందర్భంగా తెలిపారు. స్వామియాదవ్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

సరుకుల పంపిణీ



ములుగు/ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రగతి కాలనీకి చెందిన మేకల భాగ్యలక్ష్మీ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి గంగ్రకోట సుధీర్‌సేవా ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులు బియ్యం, కూరగాయలు, కిరాణ సామగ్రి పంపిణీ చేశారు.

గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయాలి



ఏటూరునాగారం: ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపిక గ్రామసభల ద్వారానే జరగాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు లోబడి ఈ ప్రాంతంలో తెలంగాణ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారానే జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఏటూరునాగారం డివిజన్ అధ్యక్షుడు టింగ బుచ్చయ్య, గొంది కామేష్, పూనెం రాధాకృష్ణ, వాజేడు మండల కార్యదర్శి సుధాకర్, వెంకటాపురం మండల అధ్యక్షులు తుర్స కృష్ణబాబు, చంటి, నేత్ర నందు పాల్గొన్నారు.

పరామర్శ



గోవిందరావుపేట: మండలంలోని పస్రా గ్రామానికి చెందిన బైరి శ్రీకాంత్, చల్వాయి గ్రామానికి చెందిన గుర్రం విజయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట జిల్లా, మండల నాయకులు ఉన్నారు.



మంగపేట: నిమ్మగూడెంలో ప్రజాపాలన గ్రామసభ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తుల రవి



వాజేడు: దరఖాస్తులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ రావు



చెల్పాకలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి



వాజేడు: ప్రజాపాలనలో పాల్గొన్న ఎస్పీ గౌష్ ఆలం

పూర్తి వివరాలు ఇవ్వాలి

● అదనపు కలెక్టర్ శ్రీజ

ఏటూరునాగారం: ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు వారి వివరాలను పూర్తిగా దరఖాస్తులో రాసి ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ అన్నారు. గురువారం మండలంలోని చెల్పాక, అల్లంవారిఘణపురం పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన అభయ హస్తం దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అక్కడ దరఖాస్తుదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ అంశాలలో ఎలాంటి దరఖాస్తులు వస్తున్నాయని, లబ్ధిదారులకు అర్థం కాకపోతే ప్రభుత్వ ఉద్యోగులు వారికి వివరించాలన్నారు. విధులు కేటాయించిన ఉద్యోగులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవన్నారు. కాగా, చెల్పాకలో 175 దరఖాస్తులు, అల్లంవారిఘణపురంలో 149 వచ్చాయి. ఆమె వెంట తహసీల్దార్ సృజన్, ఎంపీడీఓ కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, సర్పంచ్ పలక చిన్న, ఏఓ వేణుగోపాల్, ఏఈఓ రాజు, పంచాయతీ సెక్రటరీలు శ్రీనివాస్‌రావు, సందీప్, చెల్పాక సర్పంచ్ సుమతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ సందర్శన

ఏటూరునాగారం మండలంలోని చెల్పాక పంచాయతీలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి తనిఖీ చేశారు. అక్కడ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

వెంకటాపురం(కె): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామ సభల వద్ద దివ్యాంగులకు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవిన్యూ) వేణుగోపాల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నూగూరు, బీసీ మర్రిగూడెం, రాచపల్లి గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలను ఆయన పరిశీలించారు. గ్రామ సభల వద్ద ఏర్పాటు చేసిన దరఖాస్తు స్వీకరణ కౌంటర్లను పరిశీలించారు. దరఖాస్తు స్వీకరణ కౌంటర్ల వద్ద రద్దీ పెరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అరవిందకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ అడ్డూరి బాబు, తహసీల్దార్ సమ్మయ్య, ఎంపీఓ హనుమంతరావు, వ్యవసాయ అధికారి నర్సింహారావు, సర్పంచ్‌లు సమ్మయ్య, ఇండ్ల లలిత, అట్టం సత్యవతి, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్ ఉన్నారు.

ప్రజా పాలనకు విశేష స్పందన

వాజేడు: ప్రజా పాలన కార్య క్రమానికి మండలంలో విశేష స్పందన వచ్చింది. మండల పరిధిలోని టేకుల గూడెం,పెద్ద గొళ్లగుడెం, దూలాపురం, పూసూరు గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను తీసుకున్నారు. పూసూరులో మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, టేకులగూడెంలో ఎంపీడీఓ విజయ, పెద్దగొళ్ల గూడెంలో ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, దూలాపురంలో తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీంలను ఏర్పాటు చేసి ఆరుగ్యారంటీ పథకాలకు దరఖాస్తులను స్వీకరించారు. నాలుగు గ్రామ పంచాయతీలో 623 కుటుంబాలు ఉండగా అందులో 610 దరఖాస్తులు వచ్చాయి. ప్రజలు ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్లు, గ్యాస్ సబ్సిడీ, గృహలక్ష్మి, మహా లక్ష్మి లాంటి పథకాలకు దరఖాస్తులను చేసుకున్నారు. కొత్త రేషన్ కార్డులకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి.

జిల్లా అధికారుల పరిశీలన

ప్రజాపాలన కార్యక్రమాన్ని జిల్లా అధికారులు గురువారం పరిశీలించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) వేణుగోపాల రావు మండల పరిధిలోని దూలాపురం, పెద్ద గొళ్లగూడెం గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్య క్రమాలను పరిశీలించారు. ఎస్పీ గౌష్ ఆలం, ఏటూర్ నాగారం ఏఎస్పీ శిరిశెట్టి సంకీర్త్ ప్రజాపాలన కార్యక్రమాలను పరిశీలించారు.



చెల్పాకలో దరఖాస్తును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కన్నాయిగూడెం: ప్రజాపాలన కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని ములుగు అడిషనల్ (రెవెన్యూ) కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. మండలంలోని చింతగూడెంలోని నిర్వహిస్తున్న ప్రజాపాలనను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జనగం సమ్మక్క, జెడ్పీటీసీ కరస్ చందు గాంధీ, వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, సర్పంచ్ దుర్గం నారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, తహసీల్దార్ సలీమ్, డీటీ సయ్యాద్ సర్వర్ పాషా, విద్యుత్ ఏఈ స్వామి, ఎంపీఓ రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు జాడి రాంబాబు, కార్యదర్శి వినోద్ పాల్గొన్నారు

మంగపేట: ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని మండల స్పెషలాఫీసర్ తుల రవి అన్నారు. మండలంలో గురువారం మొదటి రోజు పలు గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. నిమ్మగూడెంలో 140 మంది, దొమెడ 300, నర్సాయిగూడెం 80, బుచ్చంపేటలో 191 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు ఆయా గ్రామసభల టీమ్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తుల రవి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలకోసం దరఖాస్తు చేసుకునే విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆశవర్కర్లు, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తు ఫారాలను ప్రతి ఇంటికి తీసుకువచ్చి ఇస్తారన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు దరఖాస్తు చేసుకునే ఇంటి యజమాని పాస్ ఫొటో, వైట్ రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, కరెంటు మీటర్ సర్వీస్ నంబర్, గ్యాస్ కనక్షన్ నంబర్, ఉపాధిహామీ జాబ్ కార్డు నంబర్ వెంట తీసుకుని వస్తే దరఖాస్తు ఫారాన్ని నింపేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్ల నిర్వాహకులు నింపి రసీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామ సభల వద్ద ఏటూరునాగారం సీఐ రాజు ఆధ్వర్యంలో ఎస్సై గోదరి రవికుమార్ సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసుల సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. శుక్రవారం అకినేపల్లిమల్లారం, కత్తిగూడెం, బ్రాహ్మణపల్లి, రామచంద్రునిపేట గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరస్వామి, ఏటూరునాగారం సీఐ రాజు, ఎంపీడీఓ శ్రీధర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ కుమారస్వామి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలనకు అనూహ్యస్పందన

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని వెంగ్లాపూర్, నర్సాపూర్, అంకంపల్లి, దామెరవాయి గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజాపాలన ఆరుగ్యారంటీల దరఖాస్తులకు ప్రజల నుంచి అనూహ్యస్పందన లభించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీలకు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రజలు ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాల వద్ద బారులుదీరారు. అధికారులు దరఖాస్తుల ఫారాలను కేంద్రాల వద్ద ప్రజలకు అందించారు. చదువు రాని వారికి అధికారులే దరఖాస్తు ఫారాలను నింపి ఇచ్చారు. నాలుగు గ్రామ పంచాయతీల్లో కలిపి మొత్తం 793 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఎంపీఓ శ్రీధర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.



మంగపేట: సీఐ రాజుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ వీరస్వామి



వెంకటాపురం(కె): దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



వెంకటాపురం(కె): ప్రజాపాలన గ్రామసభలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్



ఎస్ఎస్ తాడ్వాయి: దరఖాస్తులు సమర్పించేందుకు క్యూలో ప్రజలు



చింతగూడెంలో దరఖాస్తు తీసుకుంటున్న అధికారులు



మంగపేట: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పౌష్టికాహారం అందించాలి

ఏటూరునాగారం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. మండలంలోని రొయ్యూర్ ఇప్పలగడ్డ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. అనంతరం టీచర్లు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఎలాంటి పోషకాహారం అందిస్తున్నారని ఆరా తీశారు. క్రమం తప్పకుండా పోషణ అందిస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

బీసీలకు సముచిత స్థానం

ములుగు: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)లో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని నియోజకవర్గ అధ్యక్షుడు భూక్య జంపన్న నాయక్ అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయిన మాజీ రిటైర్డ్ ఆర్మీ వీరబోయిన రాజేందర్‌ను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం శాలువాతో కప్పి, పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు జంపన్న నాయక్, మాజీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు నరేష్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ సతీశ్, కృష్ణ, ముఖేష్, రాజశేఖర్‌వర్మలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జంపన్న

ప్రతీ కుటుంబానికి రాముడి అక్షింతలు



సమావేశంలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

మొగుళ్లపల్లి: అయోధ్య రామయ్య అక్షింతలను ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తామని విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందాల చందర్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి ఒకటి నుంచి 15వ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి కుటుంబానికీ రాముడి అక్షింతలు అందజేయడం జరుగుతుందన్నారు. అయోధ్య శ్రీరామ జన్మభూమిలోని జనవరి 22న శ్రీ బాల రాముడి విగ్రహ పునఃప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. అదే శుభముహూర్త సమయానికి మనకు దగ్గరలో ఉన్న ఆలయాల్లో హిందూ బంధువులతో కలిసి భజన కీర్తనలు నిర్వహించాలన్నారు. టెలివిజన్ లేదా డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసుకొని రాముడి నూతన విగ్రహ పునఃప్రతిష్ఠాపన ప్రత్యక్ష ప్రసారాన్ని సామూహికంగా వీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ ప్రచారక్ విగ్నేశ్వర్ జీ, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మండల సంచలన సమితి సంయోజక్ శ్రీరామ్ రఘుపతి, సహ సంయోజక్ కనుకుల లక్ష్మారెడ్డి, సభ్యులు బాపురావు, శ్రీనివాస్ రావు, వేముల కిరణ్ కుమార్ గౌడ్, దేవునూరి కుమార్ మహిపాల్ రెడ్డి, శ్రీమన్నారాయణ, నగేష్, భద్రయ్య, చందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ నాయకులు గురువారం నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. కార్యకర్తలు మిఠాయిలు తినిపించుకుని జై కాంగ్రెస్ అంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజల పార్టీ అని ఎప్పటికీ ప్రజల పక్షానే ఉంటుందన్నారు. కాంగ్రెస్‌తో పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



మంగపేట: వైఎస్సార్ సెంటర్‌లో కేక్ కట్‌చేస్తున్న జయరాంరెడ్డి, సోమయ్య



ఎస్ఎస్ తాడ్వాయిలో..



కన్నాయిగూడెం: కొబ్బరి కాయ కొడుతున్న ఎంపీపీ జనగం సమ్మక్క



ఏటూరునాగారం: కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తున్న చిటమట రఘు



వాజేడు: నినాదాలు చేస్తున్న పార్టీ నాయకులు

ఇంటింటికీ దరఖాస్తు పత్రం అందజేస్తాం..

ఏటూరునాగారం: ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని వార్డుల వారీగా ఆరు గ్యారంటీ పథకాలకు చెందిన దరఖాస్తు పత్రాన్ని ఇంటింటికి ఇవ్వడం జరుగుతుందని సర్పంచ్ ఈసం రామ్మూర్తి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ సభలు జనవరి 2, 3, 4వ తేదీల్లో జరుగుతాయన్నారు. బూటారం, ఎక్కెల, ఏటూరునాగారంలో మూడు రోజుల పాటు ఈ గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరు కూడా దరఖాస్తులను జిరాక్స్ సెంటర్లలో కొనుగోలు చేయవద్దన్నారు.



మాట్లాడుతున్న ఈసం రామ్మూర్తి